# జైలు కథలు 12

# ప్రత్యుపకారం

మనిషి మనుగడకు డబ్బే ప్రధానం అనుకుంటున్న ఈ రోజుల్లో, మానవత్వం కూడ అవసరమని నిరూపించాడు రామన్న. చట్టం దృష్టిలో నేరస్థుడైనా, అతనిముఖంలో ఎన్నడూ చిరునవ్వేగాని విచారాన్ని చూడలేదు నేను. వేదాంత ధోరణిలోసాగే అతని మాటలు చాల చక్కగా వుంటాయి. అతను చేసిన త్యాగం నిజంగా మరువలేనిది. మరపురానిది. ఆ త్యాగం అతని జీవిత గమ్యాన్నే మార్చివేసింది.

గద్వాలకు నాలుగుకిలోమీటర్ల దూరంలో వున్న గ్రామం రామన్నది. హరిజనుడు. రెండు ఎకరాల మెట్ట మాత్రం వుంది, తండ్రి చెప్పులుకుట్టి జీవనం చేస్తుండేవాడు. రాధ చెల్లెలు. టెన్త్ చదువుతూ వుంది. రామన్న ప్రభుత్వ స్కాలర్‌షిప్‌తో ఉస్మానియా యూనివర్శిటీ నుంచి ఎమ్. ఫిల్. చేశాడు. ప్రస్తుతం వుద్యోగాన్వేషణలో వున్నాడు. ఆ గ్రామ సర్పంచి నాయుడు. హరిజనులను హీనాతిహీనంగా చూసేవాడు. అనేక యిబ్బందులకు గురిచేసేవాడు. అయినా హరిజనులు సహనం వహించారు. రామన్న మానవత్వాన్ని ప్రేమించే మనసున్న మనిషి.




ఆరోజు హైదరాబాద్‌నుండి బస్ గద్వాలలో దిగి, కాలినడకన స్వగ్రామం బైలుదేరాడు రామన్న. గ్రామం యింకా వొక కిలోమీటరు వుందనగా, ప్రక్కనే వున్న జొన్నచేలోనుండి సన్నని మూలుగు వినవస్తోంది. అటుకేసి నడిచాడు. అక్కడి దృశ్యంచూసి నిర్ఘాంతపోయాడు. ఎవరో స్త్రీమూర్తి కాళ్ళుచేతులు కట్టివేయబడి నగ్నంగా వుంది. నోటిలో చీరె కొంతవరకు కుక్కబడివుంది. చూడగానే ఆమె శీలం బలవంతంగా దోచుకోబడిందని గ్రహించాడు. ఆమె కట్లూడదీశాడు. మనుషుల్లో వున్న రాక్షసుల్ని వూహించగలిగేడు. గుండెలో ఎక్కడో సన్నని కంపరం బయలుదేరింది. అనాలోచితంగా పిడికిళ్ళు బిగుసుకున్నాయి. ఆమె బట్టలు ధరించింది. ఆమె కళ్ళ నిండుగా కృతజ్ఞత నిండి వుంది. అయినా సిగ్గుతో వంచిన తల ఎత్తలేక పోయింది. జరుగబోయే పర్యవసానం ఆలోచించలేక పోయిన రామన్న ఆమెను వెంటబెట్టుకొని యింటికి చేరాడు.

ఆమె పేరు అరుణ. కర్నూలు నివాసి. నాల్గు సంవత్సరాల క్రితం సోకిన కలరా వల్ల తండ్రిని, తల్లిని కోల్పోయింది. అయినా కలవారి ఇండ్లలో పని చేసుకుంటూ బ్రతికేది. ఒక మోసగాడు మాయ మాటలు చెప్పి, పెండ్లి చేసుకొంటానని నమ్మించి తీసుకొనివచ్చి, ఇద్దరు కిరాయి వెధవల సాయంతో ఆమె సమస్తం హరించి వెళ్ళిపోయాడు. ఆమె దీనగాథ విన్న రామన్న హృదయం జాలిగా మూలిగింది. గ్రామస్తులు తలో విధంగా అనుకోసాగారు. కాని ఆ ఇంటివారు ఆమెను ఎంతో ఆదరించారు.

ఇది అవకాశంగా తీసుకొని రామన్న కుటుంబాన్ని రచ్చబండ వద్దకు పిలిపించారు. తీర్పు మొదలైంది. ఎవరో తెలియని యువతిని తెచ్చి యింట్లోపెట్టుకోవడం వారికి నచ్చలేదన్నారు. అందరూ తలో విధంగా మాట్లాడారు. అరుణ చాల బాధపడింది. తనవల్ల వొక మంచిమనిషికి మచ్చరావడం ఆమె సహించలేకపోయింది. గ్రామం వదలి వెళ్ళిపోతానంది. కాని రామన్న కుటుంబీకులు మాత్రం అందుకు అంగీకరించలేదు. రామన్న కాసేపు ఆలోచించి అరుణ మెడలో పసుపుతాడుకట్టి తనభార్యగా ప్రకటించుకొన్నాడు. మలినమైన తాను అతనికి భార్యగా తగనని అరుణ వేడుకొన్నప్పటికీ రామన్న నిర్ణయం రవంత కూడ సడలలేదు. అందరికంటే ఈ విషయంలో ఎక్కువగా సంతోషించిన మనిషి రాధ. అరుణ వచ్చినప్పటినుంచి యిద్దరూ చక్కగా కలిసిపోయారు. రామన్న తీసికొన్న నిర్ణయం సర్పంచికి గొడ్డలిపెట్టే అయింది.

ఆ రోజు ఆదివారం. వదిన, ఆడబిడ్డలు శనగచేనుకు కాపలా వెళ్ళారు. మధ్యాహ్నం అన్నం తేవటానికి అరుణ యింటికివెళ్ళింది. తిరిగి వచ్చేసరికి రాధ చేలో లేదు. ఆ చుట్టుపట్టు జనంలేరు. అరుణ మనసు కీడు శంకించింది. ప్రక్కనే వున్న జొన్నచేలో ప్రవేశించింది. మాటలు వింది—

"చెడినదాన్ని చేసుకున్నాడు మీ అన్న. కాబట్టి మీ కుటుంబమంతా చెడినట్లే లెక్క. మరేం ఫరవాలేదు" మాటలు వినిపిస్తున్న దిక్కుగా నడిచింది అరుణ. సర్పంచి రాధను బలవంతం చేస్తున్నాడు. అతని కబంధ హస్తాల్నుంచి బయట పడటానికి ఆమె విశ్వప్రయత్నం చేస్తోంది. అరుణ ఆగ్రహం అధిగమించింది. తను కోల్పోయిన పవిత్రమైన శీలాన్ని రాధ కోల్పోబోతూంది. వీల్లేదు. స్త్రీమూర్తి భద్రకాళిగా మారింది. అరుణ విసరిన రాయి నేరుగా సర్పంచి కుడి కణతను తాకింది. కోడిపిల్లలా గిర్రున తిరిగి పడ్డాడు.

సర్పంచి చనిపోయిన విషయం పోలీసులకు తెలియపర్చబడింది. నేరాన్ని అంగీకరిస్తానన్నది అరుణ. కాని తన చెల్లెలి శీలాన్ని కాపాడినందుకు ప్రతిగా ఆనేరాన్ని తనమీద వేసికొని జైలుపాలయ్యాడు రామన్న. 'రామన్న మనిషా....కాదు.... మహాత్ముడు' అని అనుకోకుండా వుండలేకపోయాను.

—'ప్రసాద్'